సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 14 । జూలై । 2024



సోమశిలలో 9.92 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 9.92 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 71 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,540
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,769
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,972
నవర (8 గ్రాములు)	రూ.55,776

గరిష్టం/కనిష్టం
32.2 /25.6

వాతావరణం

గాలిలో తేమ 58 శాతంగా శనివారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా వర్షాలు ఆదివారం కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

క్వార్ట్జ్‌పై తమ్ముళ్ల కన్ను

పర్మిట్ల జారీని రద్దు చేసినా.. డోంట్ కేర్

- దాదాపు 160 టన్నుల తరలింపు
- నందిపాడు వద్ద వాహనాల సీజ్
- మైనింగ్ అధికారులకు పోలీసుల నివేదిక
- విడిచిపెట్టాలంటూ అధికారులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు

ఇసుకను కొల్లగొట్టి యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నేతల కన్ను తాజాగా క్వార్ట్జ్‌పై పడింది. వాస్తవానికి ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలోని అన్ని రకాల ఖనిజ సంపదల తరలింపునకు సంబంధించిన పర్మిట్ల జారీని నిలిపేసింది. అయితే ఇవి సాధారణ వ్యక్తులకే గానీ తమకు కాదన్నుకున్నారో ఏమో.. ఈ నిబంధనను తెలుగు తమ్ముళ్లు ఉల్లంఘించారు. కొండాపురం మండలం యర్రబొట్లపల్లి క్వారీలో నిల్వ చేసిన విలువైన మైకా క్వార్ట్జ్‌ను దొంగ దారిలో తరలించేందుకు ఆ పార్టీ నేతలు గురువారం అర్ధరాత్రి యత్నించి, పోలీసులకు చిక్కారు. దీంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

ఉదయగిరి: అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఉదయగిరి నియోజకవర్గంలోని విలువైన ఖనిజ సంపదను కొందరు వ్యాపారులు అక్రమంగా కొల్లగొడుతున్నారు. ఖనిజ తరలింపునకు సంబంధించిన పర్మిట్ల జారీని ప్రభుత్వం నిలిపేసినా, అధికార పార్టీ అండతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

జరిగింది ఇదీ..

కొండాపురం మండలం యర్రబొట్లపల్లి నుంచి నాలుగు టర్బో లారీల ద్వారా క్వార్ట్జ్‌ను అక్రమంగా తరలించసాగారు. ఈ తరుణంలో వీటిని దుత్తలూరు ఎస్సై ఉమాశంకర్ అడ్డుకున్నారు. పర్మిట్లను ప్రభుత్వం నిలిపేసిన క్రమంలో వీటిని ఎలా రవాణా చేస్తారంటూ వావానాలను సీజ్ చేశారు. వీరి వద్ద ఉన్న పర్మిట్లపై అనుమానంతో వాటిని జిల్లా మైనింగ్ అధికారులకు పంపగా, అవి ఫేక్ అని నిర్ధారించారని తెలుస్తోంది. అయితే ఎస్సైపై సదరు వ్యాపారి దురుసుగా ప్రవర్తించి, బెదిరింపులకు పాల్పడి తమ వాహనాలను తీసుకెళ్లేందుకు యత్నించారని సమాచారం. ఈ క్రమంలో వాహనాలను సీజ్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు నివేదిక పంపారు.



దుత్తలూరు పోలీసులు సీజ్ చేసిన టర్బో లారీలు

నిబంధనలకు తిలోదకాలు

కొత్త ప్రభుత్వం కొలువుదీరాక రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ సంపదకు పర్మిట్ల జారీని ఆపేశారు. జూన్ 25 నుంచి రవాణా పూర్తిగా నిలిచిపోయింది. అయితే కొండాపురం మండలం యర్రబొట్లపల్లి క్వారీలో నిల్వ చేసిన విలువైన మైకా క్వార్ట్జ్‌ను నర్రవాడ, దుత్తలూరు, చుంచులూరు మీదుగా తిరుపతి వైపునకు అడ్డదారిలో తరలించేందుకు గురువారం అర్ధరాత్రి ప్లాన్ చేశారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో అక్రమంగా తరలివెళ్తున్న లారీలను నందిపాడు వద్ద ఎస్సై అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆయనపై సదరు వ్యాపారి బెదిరింపులకు దిగారు. వాహనదారుల వద్ద ఉన్న నకిలీ వే బిల్లులను స్వాధీనం చేసుకొని వాహనాలను స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఓ ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితుడైన ఒకరు ఈ లారీలను విడిచిపెట్టేందుకు తీవ్రంగా యత్నించినా, అది కుదరలేదని సమాచారం.

160 టన్నుల క్వార్ట్జ్

సుమారు 160 టన్నుల విలువైన సరుకు ఉండటంతో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు భారీగా ముడుపులు సమర్పించి ఈ కేసు నుంచి బయటపడేందుకు యత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. నందిపాడు వద్ద వాహనాలను పట్టుకున్న విషయమై ఎస్సైను సంప్రదించగా, అనుమతి పత్రాల్లేని కారణంగా వాహనాలను సీజ్ చేసి, మైనింగ్ అధికారులకు నివేదిక పంపామని, అన్నింటినీ పరిశీలించి తగు చర్యలను వారు చేపట్టనున్నారని తెలిపారు.

తీవ్ర ఒత్తిళ్లు

పోలీసుల అదుపులో ఉన్న వాహనాలను విడిపించేందుకు గానూ ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ మంత్రిని సదరు వ్యాపారి ఆశ్రయించారు. వీరి ద్వారా మైనింగ్ అధికారులు, పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసుల్లేకుండా.. నామమాత్రపు ఫైన్‌తో విడిపించుకునే యత్నాలను ముమ్మరం చేశారు. అయితే పర్మిట్ల జారీని రాష్ట్ర ప్రభుత్వమే నిలిపేసిన తరుణంలో జరిమానా విధించి విడిచిపెట్టే అవకాశాల్లేవు. దీంతో ఏమీ చేయాలనే అంశమై ఉన్నతాధికారులను మైనింగ్ శాఖ అధికారులు సంప్రదించారని తెలుస్తోంది.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు



స్వర్ణాల ఘాట్‌ను పరిశీలిస్తున్న ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. రొట్టెల పండగ ఈ నెల 17న ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలోని బారాషహీద్ దర్గాను శనివారం ఆయన సందర్శించారు. దర్గా ఆవరణలో ఏర్పాటు చేస్తున్న పోలీస్ కంట్రోల్ రూమ్, ప్రవేశ.. నిష్క్రమణ మార్గాలు, స్వర్ణాల ఘాట్ తదితరాలను పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. పార్కింగ్ ప్రదేశాలైన రేడియో స్టేషన్, నూతన జెడ్పీ, కార్పొరేషన్ కార్యాలయాలు, టీబీ హాస్పిటల్, సెయింట్ జోసఫ్స్ స్కూల్, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ఎదురుగా గల స్థలం తదితరాలను పరిశీలించి ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని, మఫ్టీలో పోలీస్ సిబ్బందిని నియమించాలని సూచించారు. నగర, ట్రాఫిక్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, అల్తాఫ్ హుస్సేన్, శివాజీ, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 16లోపు సమర్పించాలని.. ఆయా కళాశాలల్లో ప్రవేశాన్ని 18న కల్పించనున్నామని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి 13 మంది ‘కేఎన్నార్’ విద్యార్థులు

నెల్లూరు (టౌన్): గత విద్యాసంవత్సరంలో కేఎన్నార్ స్కూల్లో పదో తరగతి చదివిన 13 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారని ప్రిన్సిపల్ విజయప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైష్ణవి, జెరోమ్, ఫమీలా, ఆకాష్, మహిత, ఉమేష్‌చంద్ర, మృదుల, కృష్ణకుమార్, కార్తికేయ, గణేష్, కేశవకారుణ్య, జశ్వంత్, విశ్వతేజ, జ్యోతిర్మయి, సాకేత్‌కృష్ణ, వశిత అర్హత సాధించారని చెప్పారు. ఈ క్రమంలో వీరికి అభినందనలను తెలియజేశారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో గల దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శనివారం తెలిపారు. ఒకటో యూనిట్లో 425.. రెండో యూనిట్లో 430 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని చెప్పారు. ఓవరాలింగ్ కారణంగా మూడో యూనిట్లో ఉత్పత్తిని నిలిపేశామని వివరించారు.

పరిశోధన స్థాన శాస్త్రవేత్త బదిలీ

పొదలకూరు: స్థానిక చిరుధాన్య పరిశోధన స్థానం, ఏజీ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు కదిరి పరిశోధన స్థానానికి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న వేరుశనగ పరిశోధన శాస్త్రవేత్త ప్రసన్నరాజేష్ బదిలీపై పొదలకూరు వచ్చారు. కాగా సహాయ.. ప్రధాన శాస్త్రవేత్తగా పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానంలో సేవలను వెంకటేశ్వర్లు అందించారు.

గురుకుల పాఠశాలల్లో తనిఖీలు



స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఉషారాణి

ఆత్మకూరు: పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. ఆత్మకూరు, ఏఎస్‌పేటలోని గురుకుల పాఠశాలలను జిల్లా విద్య పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబుతో కలిసి పరిశీలించారు. విద్యాపరమైన అంశాలపై గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులను ప్రశ్నించి, సమాధానాలను రాబట్టారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి.. వంట గదిలో ఆహార పదార్థాలను రుచి చూశారు.

అక్టోబర్ నుంచి ‘సింహపురి’ వేళల్లో మార్పు

నెల్లూరు(సెంట్రల్): సికింద్రాబాద్ – గూడూరు (12710) సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు వేళల్లో అక్టోబర్ 18 నుంచి మార్పులు చేయనున్నామని రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో ప్రస్తుతం రాత్రి 11.05కు బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 8.33కు నెల్లూరుకు వస్తోందని చెప్పారు. అక్టోబర్ నుంచి సికింద్రాబాద్‌లో రాత్రి 10.05కు బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 7.58కు నెల్లూరు చేరుకోనుందని వివరించారు.

వాహనాల దారి మళ్లింపు

నెల్లూరు(క్రైమ్): వెంకటేశ్వరపురం నుంచి సౌలుచింతలకు వెళ్లే మార్గంలోని ఫ్లైఓవర్ కుంగడంతో బస్సులు, లారీలు తదితర వాహనాలను తాత్కాలికంగా దారి మళ్లించామని ట్రాఫిక్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరుకు కోవూరు మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, జొన్నవాడ మీదుగా సైతం బుచ్చి, ఆత్మకూరు వెళ్లొచ్చని తెలిపారు. పామూరు వెళ్లే ఆర్టీసీ బస్సులను జొన్నవాడ మీదుగా.. బుచ్చి, ఆత్మకూరు, కడప వైపు వెళ్లే బస్సులను వెంకటేశ్వరపురం బ్రిడ్జి కింద నుంచి కోవూరు మీదుగా నడపనున్నారని వెల్లడించారు.

జిల్లా పోలీస్ బాస్‌గా కృష్ణకాంత్

- ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లా ఎస్పీగా కృష్ణకాంత్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది ఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను శనివారం జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఆరిఫ్ హాఫీజ్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు ఎస్పీగా పనిచేస్తున్న కృష్ణకాంత్‌ను నియమించారు. గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ కమాండర్‌గా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏఎస్పీగా తొమ్మిది నెలలు.. అదే జిల్లా రంపచోడవరంలో ఓఎస్డీగా ఆయన విధులు నిర్వర్తించారు. గతేడాది ఏప్రిల్లో కర్నూలు ఎస్పీగా నియమితులయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, సైబర్ నేరాల కట్టడిలో తనదైన ముద్రవేశారు.



నూతన ఎస్పీ కృష్ణకాంత్

- బదిలీపై వెళ్తున్న ఆరిఫ్ హాఫీజ్ ఈ ఏడాది ఏప్రిల్ నాలుగున జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించారు. విధి నిర్వహణలో రాజీలేని వ్యక్తిగా పేరు గడించారు.

ఎస్పీ నేపథ్యం

పుట్టిన తేదీ : 22 జనవరి, 1987
తల్లిదండ్రులు : రామాంజనేయులు, రామతులసి
భార్య : ప్రవీణ (వైద్య విద్య), ప్రస్తుతం గృహిణి
సొంతూరు : ఎస్సెస్‌పల్లె, గుత్తి మండలం, అనంతపురం జిల్లా
కుటుంబ నేపథ్యం : వ్యవసాయాధారిత
విద్యాభ్యాసం : పదో తరగతి (గుత్తి జెడ్పీ హైస్కూల్), ఇంటర్ (శంకరానందస్వామి కళాశాల, గుంతకల్), బీఎస్సీ బయోటెక్నాలజీ (అనంతపురం సీఎంఐ కళాశాల), ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ (హరియాణాలోని నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)
బ్యాచ్ : 2017 ఐపీఎస్
సర్వీస్‌లో చేరిన తేదీ : 18 డిసెంబర్, 2017

తగ్గేదేలేదంటున్న మాఫియా

బరితెగిస్తున్న చికెన్ వ్యర్థాల తరలింపు ముఠా

- మామూళ్లతో అధికారుల కళ్లకు గంతలు
- జిల్లాకు యథేచ్ఛగా చేరుకుంటున్న వాహనాలు
- తాజాగా కోవూరు ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ
- బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన టీడీపీ నేత మంతనాలు

ప్రజారోగ్యాన్ని కబళించే చికెన్ వేస్ట్‌ను చేపల చెరువులకు సరఫరా చేసే మాఫియా ఆగడాలకు అంతేలేకుండాపోతోంది. నెలవారీగా రూ.కోట్లల్లో లావాదేవీలు జరిగే వ్యాపారాన్ని మాఫియా నిర్వాహకులు వదిలే ప్రసక్తే లేదంటున్నారు. కోవూరు నియోజకవర్గంలోని ఓ మండల స్థాయి టీడీపీ నేత అండదండలతో మరింత రెచ్చిపోతున్నారు. చేపల గుంతలున్నంత వరకు ఈ వ్యాపారాన్ని ఆపేది లేదని.. అధికారులు, పోలీసులకు మామూళ్లను ముట్టజెప్పున్నామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చికెన్ వేస్ట్ వ్యాపారానికి కోవూరు అడ్డాగా మారింది. ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పుగా పరిణమించే ఈ వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన పోలీసులు, మత్స్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. అధికార పార్టీలో ఉన్న కోవూరుకు చెందిన చోటా నేతతో పాటు మండల స్థాయి నేతలూ ఈ అక్రమ దందాను తమ కనుసన్నల్లో సాగిస్తున్నారు.

నెలకు రూ.పది కోట్ల దందా

నెలవారీగా ఈ దందా రూ.పది కోట్లకుపైగా ఉంటోందని సమాచారం. మాంసాహార ప్రియులు అమితంగా ఇష్టపడే చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను వేస్తున్నారని తెలుసుకొని ప్రజలు నివ్వెరపోతున్నారు. దాదాపు రెండు వేల ఎకరాల్లో సాగు చేస్తున్న చేపల చెరువులకు చికెన్ వ్యర్థ పదార్థాలను చేరవేస్తున్నారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక బరితెగింపు

టీడీపీ అధికారంలోకి రాగానే ఈ మాఫియా బరితెగించి చికెన్ వ్యర్థ పదార్థాలను టన్నుల కొద్దీ సరఫరా చేస్తోంది. వ్యర్థ పదార్థాలతో వాహనాలు జిల్లా సరిహద్దులను దాటి వస్తున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. స్టేషన్లతో పాటు ఉన్నతాధికారులకు మామూళ్లు నెలవారీగా అందుతుండటంతో ఎన్ని ఆరోపణలొచ్చినా, పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇందుకూరుపేట మండలం కొమరికలోని చేపల చెరువులో కోళ్ల వ్యర్థాల డంపింగ్

జోరుగా నిషేధిత క్యాట్ ఫిష్ సాగు

కోవూరులో చికెన్ వ్యర్థాలను సరఫరా చేసే మాఫియా అంతటితో ఆగకుండా నిషేధిత క్యాట్ ఫిష్‌ను సాగు చేస్తోందని సమాచారం. కోవూరు మండల పరిధిలోని గుమ్మళ్లదిబ్బ వద్ద దాదాపు 30 ఎకరాల్లో క్యాట్ ఫిష్‌ను సాగు చేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. వాస్తవానికి క్యాట్ ఫిష్‌ను తినడం ద్వారా కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరించడంతో సాగును ప్రభుత్వం గతంలోనే నిషేధించింది. అయినా మాఫియా ఏ మాత్రం లెక్కచేయడంలేదు.

ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ

చికెన్ వ్యర్థాలను సరఫరా చేసే ముఠా ఇప్పటికే కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వద్ద పంచాయితీ పెట్టించారు. స్థానిక చెరువుల యజమానులతో పాటు టీడీపీ కీలక నేతల ద్వారా కలిశారని తెలుస్తోంది. ఈ భేటీ కోసం ఇప్పటికే మాఫియా భారీ మొత్తంలో నజరానాలను టీడీపీ నేతలకు అందజేశారనే ఆరోపణలున్నాయి. దీంతో ఎమ్మెల్యే వద్ద పంచాయితీ పెట్టి.. మరో ఏడాది వరకు మాఫియాకు సమయమిచ్చేలా తీవ్ర ఒత్తిడి తెచ్చారని తెలుస్తోంది. చేపలకు ఆహారం లేకపోతే ఇబ్బంది పడతాయని.. ఈ వ్యర్థాలు తప్పకుండా రావాల్సిందేనని.. సమయమివ్వాలని నేతలు తెగేసి చెప్పారని.. ఈ పరిణామాలతో ఎమ్మెల్యే మౌనం దాల్చారనే టాక్ నడుస్తోంది.

సంగీత, నృత్య పాఠశాలలో అడ్మిషన్లు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో గల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో 2024 – 25 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించామని ప్రిన్సిపల్ జ్యోతిర్మయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు రుసుముగా రూ.50 చెల్లించి, పాఠశాలలో గాత్ర సంగీతం, వయోలిన్, భరతనాట్యం, మృదంగం, డోలు విభాగాల్లో చేరొచ్చని చెప్పారు. నాలుగేళ్ల కాలపరిమితితో సర్టిఫికెట్ కోర్సు, కోర్సు ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల కాలపరిమితితో డిప్లొమా చేసేందుకు అర్హులని వివరించారు. సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు 2024, జూలై ఒకటి నాటికి పదేళ్లు నిండి ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు తమ పాఠశాల నుంచి దరఖాస్తులను పొంది, పూర్తి చేసిన అనంతరం ఆగస్ట్ 31లోపు సమర్పించాలని కోరారు. వివరాలకు 0861 – 2328285, 90007 86599 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పట్టించుకోకపోతే సోమశిలే

- 2021లో వచ్చిన వరదలతో అతలాకుతలం
- దెబ్బతిన్న ఆప్రాన్
- పనుల ప్రారంభంపైనే ఆశలు
- మంత్రుల రాక నేడు

నెల్లూరు (దర్గామిట్ట): మరమ్మతు పనుల కోసం జిల్లా జలనిధి సోమశిల జలాశయం నిరీక్షిస్తోంది. సుమారు ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు.. చెన్నై, నెల్లూరు వాసులకు తాగునీటిని అందించే ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్ట్ 2021 నవంబర్‌లో వచ్చిన వరదల కారణంగా అతలాకుతలమైంది. ఆ సమయంలో ఇక్కడి ఆప్రాన్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతినింది. ఈ క్రమంలో సోమశిల జలాశయాన్ని ముగ్గురు మంత్రులు ఆదివారం పరిశీలించనున్న నేపథ్యంలో, పనులు జరుగుతాయని రైతాంగం ఆశిస్తోంది.

ఊహించనంత ఇన్‌ఫ్లో

2021 నవంబర్‌లో రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఆ సమయంలో ఊహించనంత స్థాయిలో సోమశిల జలాశయానికి వరద పోటెత్తింది. వచ్చిన నీటిని నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో ప్రాజెక్ట్ పటిష్టతకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేసిన జలాలతో ప్రాజెక్ట్ ఆప్రాన్ పూర్తిగా దెబ్బతినింది. యుద్ధప్రాతిపదికన ఆయా నిర్మాణాలను చేపట్టాల్సి ఉండటంతో, నిపుణుల కమిటీ ద్వారా అంచనాలను సిద్ధం చేయించి రూ.99.9 కోట్లతో పనులను గత ప్రభుత్వం ప్రారంభించింది. అయితే పనులను కాంట్రాక్టర్ నిలిపేశారు.



సోమశిల జలాశయం

ఇవీ సమస్యలు..

- దెబ్బతిన్న ఆప్రాన్ రక్షణ గోడలను పునరుద్ధరించాల్సి ఉంది.
- ప్రాజెక్ట్‌లో సిబ్బంది.. నిపుణుల కొరత వెంటాడుతోంది.
- క్రస్ట్ గేట్ల నిర్వహణ, నీటి విడుదల, కట్టడి చేయాల్సిన మెకానికల్ సిబ్బందీ తక్కువగా ఉన్నారు.
- జలాశయ పరిరక్షణకు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాల్సి ఉంది.
- ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈలు.. ఇలా కీలకమైన అధికారులు నెల్లూరు తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటూ అడపాదడపా ఇక్కడికి వస్తున్నారు. ఈ తరుణంలో వీరు స్థానికంగా నివాసం ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆప్రాన్ ప్రాంతం

స్వర్ణ శోభితం



బిడ్డా జాగ్రత్త..



రొట్టెలు సమర్పించుకుంటున్న మహిళలు

నెల్లూరు స్వర్ణాల చెరువుకు భక్తుల తాకిడి పెరుగుతోంది. ఈనెల 17వ తేదీ నుంచి నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు ముందుగానే స్వర్ణాల చెరువు వద్దకు వచ్చి రొట్టెలు మార్చుకుంటున్నారు. అనంతరం నీటిలో దిగి సేద తీరుతున్నారు. ఈ క్రమంలో అధికారులు మౌలిక వసతుల కల్పనకు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



చిన్నారుల కేరింతలు





సరదాగా సెల్ఫీ దిగుతూ..

నేత్రపర్వం.. నృసింహుని కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకుడు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

రాపూరు : మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు తిరుచ్చిని అధిరోహించి ఊరేగించారు. తర్వాత సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.55 సన్నవి : రూ.40
పండ్లు : రూ.30

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్: రూ.131
లేయర్ రూ.110
బ్రాయిలర్ చికెన్: రూ.236
స్కిన్‌లెస్ చికెన్: రూ.264
లేయర్ చికెన్: రూ.187

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కావలి : కావలి పట్టణంలోని ముసునూరు ప్రాంతంలో ఉంటున్న తాళ్లపాశెం మురళి (50) అనే వ్యక్తి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భార్యతో ఏర్పడిన వివాదం నేపథ్యంలో మానసికంగా కుంగిపోయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కావలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

బయట నిద్రిస్తుండగా ఇల్లు గుల్ల

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలం చిరమన గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్సై ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు గ్రామంలోని కాటంరెడ్డి పెంచలరెడ్డి భార్య తన బంగారు సరడును ఇంట్లో పెట్టి బయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపహరించారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. అపహరించిన బంగారు సరడు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కావలి : మండలంలోని సర్వాయపాళెం రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. కావలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు కథనం మేరకు.. చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారిపై యాచకుడు మృతిచెంది ఉండడాన్ని సర్వాయపాళెం గ్రామస్తులు గుర్తించి స్థానిక వీఆర్వోకు సమాచారం అందించారు. ఆయన పరిశీలించి పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు సిటీ : నగరంలోని నారాయణ హాస్పిటల్ ప్రాంగణంలో గత నెలలో ఓ యువకుడి హత్య కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పెయింటింగ్ పనుల నిమిత్తం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవిగౌర్(27), లాల్‌మోహన్ మరికొంత మందితో చింతారెడ్డిపాళెంలోని నారాయణ హాస్పిటల్‌కు వచ్చారు. ఈ క్రమంలో జూన్ 30వ తేదీన హాస్పిటల్ ప్రాంగణంలో మద్యం సేవిస్తున్న రవిగౌర్, లాల్‌మోహన్‌ల మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో లాల్‌మోహన్ కోపోద్రిక్తుడై రవిగౌర్‌పై కత్తితో దాడి చేశారు. దీంతో రవిగౌర్ మృతి చెందారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లాల్‌మోహన్ హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కండలేరులో 6.303 టీఎంసీలు



రాపూరు : కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి కండలేరు జలాశయానికి 100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాబాయి అబ్బాయిల నేర సామ్రాజ్యం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రసాద్, చిత్రంలో స్వాధీనం చేస్తున్న బంగారు ఆభరణాలు

- అన్నకుమారులతో కలిసి దొంగతనాలు
- ప్రధాన నిందితునిపై లెక్కకు మించిన కేసులు
- జైలుకెళ్లొచ్చినా తీరుమారని వైనం

నెల్లూరు(క్రైమ్) : వారు ముగ్గురూ బాబాయి, అబ్బాయిలు. గుడి, బడి, ఇళ్లు, కార్యాలయాలు ఏదైనా సరే కాదేది చోరీకి అనర్హమంటున్నారు. ప్రధాన నిందితుడైన బాబాయిపై జిల్లాలో లెక్కకు మించిన కేసులు ఉండగా, ఇద్దరు అబ్బాయిలు గత కొంతకాలంగా ఆయనతో జతకట్టి చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా బుచ్చిరెడ్డిపాళెం దొంగతనం కేసులో పోలీసులు వీరిని అరెస్ట్ చేయగా మరో రెండు కేసులు వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద నుంచి 41 సవర్ల 600 గ్రాముల బంగారు ఆభరణాలు, ఓ టీవీని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీలు ప్రసాద్, సౌజన్య నిందితుల వివరాలను శనివారం వెల్లడించారు. ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి గ్రామానికి చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ గుడ్డిగౌస్ చిన్నతనం నుంచే జల్సాలు, వ్యసనాలకు బానిసయ్యారు. బేల్దారి పనులు చేసుకుంటూ యువకులతో కలిసి మోటారు దొంగతనం కేసుల్లో చిక్కి జైలుపాలయ్యాడు. అక్కడ నుంచి గ్యాంగ్‌లతో కలిసి నేరాలకు పాల్పడసాగాడు. కావలికి చెందిన షఫీవుల్లా గ్యాంగ్‌తో కలిసి ఇళ్లల్లో దొంగతనాలు, దోపిడీలు, వాహన చోరీలు చేశారు. మొదటి భార్య నుంచి విడిపోయి ఇందుకూరుపేట మండల పరిధిలో ఓ మహిళను రెండో వివాహం చేసుకుని పడారుపల్లి సుందరయ్య కాలనీకి మకాం మార్చాడు. వారి మధ్య విభేదాలు రావడం వచ్చి రెండో భార్యను హత్య చేయడంతో ముత్తుకూరు పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అనేక మార్లు జైలుకు వెళ్లినా అతని తీరులో మార్పు రాలేదు. యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు.

గతనెల 26న..

గత కొంతకాలంగా గౌస్‌బాషా తన అన్న కుమారులైన బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌కు చెందిన అల్తాఫ్, నెల్లూరు వెంకటేశ్వరపురానికి చెందిన అబీద్‌తో కలిసి దొంగతనాలు చేయసాగారు. ఈ నేపథ్యంలో నిందితులు గతనెల 26న బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ ఉపాధ్యాయుని ఇంట్లో పెద్ద ఎత్తున బంగారం, నగదును దోచుకెళ్లారు. ఈఘటనపై బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు సీసీఎస్, బుచ్చిరెడ్డిపాళెం ఇన్‌స్పెక్టర్‌లు చిట్టెం కోటేశ్వరరావు, సాంబశివరావు, హైమారావులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, సాంకేతికత ఆధారంగా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం నిందితులను ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకుని విచారించగా బుచ్చిరెడ్డిపాళెంలోని ఉపాధ్యాయుని ఇంటితో పాటు తోటపల్లిగూడూరు మండలం జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో, ప్రకాశం జిల్లా కనిగిరి మండలం తక్కెళ్లపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శ్యాంసంగ్ టీవీని దొంగలించినట్లు నేరం అంగీకరించడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. రూ.25 లక్షలు విలువ చేసే సుమారు 42 సవర్ల బంగారు ఆభరణాలు, టీవీని స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందికి అభినందన

కేసు పరిష్కారంలో కృషి చేసిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు కోటేశ్వరరావు, సాంబశివరావు, బుచ్చిరెడ్డిపాళెం సీఐ ఎం.హైమారావు, సీసీసీఎస్ సిబ్బంది వారీస్ అహ్మద్, జి.భాస్కర్, శ్రీధర్, విజయ్‌బాబు, సురేష్, శివకృష్ణ, దిలీప్, పి.సాయిఆనంద్, మహబూబ్‌బాషా, సీహెచ్ శ్రీనివాసులు, గోపికృష్ణ, బుచ్చి సిబ్బంది సురేష్, అనిల్, సతీష్‌లను ఏఎస్పీలు ప్రసాద్, సౌజన్య అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

రెప్పపాటులో విషాదం

మిల్లర్‌లో పడి మహిళా కూలీ మృతి

- అందరూ చూస్తుండగానే ఘటన

సూళ్లూరుపేట: ఆమె రెక్కాడితేగానీ డొక్కాడని రోజువారి కూలి. బతుకుదెరువు కోసం కొడుకును వెంట బెట్టుకుని బేల్దారి పనికోసం ఊరుగాని ఊరు వచ్చింది. మిల్లర్‌లో నీళ్లు పోసే క్రమంలో చీర చుట్టుకుపోవడం.. ఆపై వెంట్రుకలు చుట్టుకోవడం క్షణాల్లో జరిగిపోయింది. తర్వాత తల ఇరుక్కుపోవడం.. మిల్లర్ తిరుగుతున్నప్పుడే ఆ మహిళా కూలీ తల, మొండెం వేరుకావడం జరిగిపోయింది. కేకలు పెడుతూ.. ఆమెను కాపాడేందుకు తోటి కూలీలు సాయశక్తులా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషాద ఘటన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ వీధిలోని ఓ ఇంటికి స్లాబ్ వేయడానికి సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల నుంచి మేస్త్రి తొండా రమణయ్య సుమారు 20 మంది కూలీలను కుదుర్చుకున్నారు. ఇందులో చిట్టమూరు మండలం, కుమ్మరిపాళేనికి చెందిన ఎర్రబోతు ఇందిరమ్మ కూడా తన కుమారుడితో కలిసి శనివారం ఉదయం బేల్దారి కూలిపనికి వచ్చింది. మేస్త్రి రమణయ్య వారిని మిల్లర్ వద్ద నీళ్లు పోయడానికి నియమించారు. పనిచేస్తుండగానే నీళ్లు పట్టే క్రమంలో ఆమె చీర మిల్లర్‌లో తిరుగుతున్న ఓ రాడ్‌కు చుట్టుకుపోయింది. ఆపై వెంట్రుకలు చుట్టుకుపోయి తల, మొండెం వేరయ్యింది. ఈ హృదయ విదారకర దృశ్యాన్ని చూసిన స్థానికులు చలించిపోయారు. తోటి కూలీలు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటివరకు ఆడుతూ పాడుతూ పని చేసిన ఇందిరమ్మ కేవలం 20 సెకండ్ల వ్యవధిలోనే విగతజీవిగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్సై కె.రహీంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మరణించినట్టుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.



మిల్లర్ కింద మహిళ మృతదేహం

ఫ్యాన్సీ దుకాణం దగ్ధం

గూడూరు రూరల్: షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు అంతస్తుల్లో ఉన్న ఫ్యాన్సీ స్టోర్ అగ్నికి ఆహుతైన ఘటన శనివారం గూడూరు కుమ్మరవీధిలో చోటుచేసుకుంది. స్థానిక సూర్య ఫ్యాన్సీ దుకాణంలో శనివారం వేకువజామున కింది అంతస్తులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. పొగలు రావడంతో స్థానికులు గుర్తించి యజమానులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తుండగానే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించాయి. ఈలోగా వాహనంలో నీరు అయిపోవడంతో నీరు నింపుకుని వచ్చేందుకు వెళ్లేలోపు మూడో అంతస్తుకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి విజయకుమార్ కోట, నాయుడుపేట నుంచి మరో రెండు అగ్నిమాపక వాహనాలను పిలిపించి సుమారు ఐదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.కోటి వరకు నష్టం వాటిల్లి ఉండొచ్చని యజమాని తెలిపారు.